

మాలాధారులతో నిండిపోయిన సోన్ పుష్కరఘాట్



గోదావరిలో సూర్య నమస్కారం ఆచరిస్తున్న బాలికలు

శరన్నవరాత్రులు.. భక్తిప్రపత్తులు



ముథోల్‌లో అమ్మవారు

దసరా శరన్నవరాత్రుల్లో అమ్మవారిని భక్తి ప్రపత్తులతో కొలుస్తారు. గురువారం మొదటి రోజున సూర్యోదయానికి ముందు నుంచే సోన్ గోదావరిలో పవిత్ర స్నానం ఆచరించేందుకు వచ్చిన భక్తులతో పుష్కరఘాట్ కిటకిటలాడింది. అనంతరం బంగల్ పేట్ మహాలక్ష్మి, నందిగుండం దుర్గామాత ఆలయాల వద్ద మాలాధారణ కోసం పెద్ద ఎత్తున తరలివచ్చారు. బాజాభజంత్రీలు, డప్పు వాయిద్యాలు, మంగళహారతులతో దుర్గామాతల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి మండపాలలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు - చిత్రాలు : న్యూస్‌టుడే,నిర్మల్



మంగళహారతులు, డప్పు వాయిద్యాలతో అమ్మవారిని మండపానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

రక్షణగా పాతపడవలు

బాసర గోదావరి నది ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు గోదావరి నదిలో స్నానాలు చేసిన అనంతరం అమ్మవారి దర్శనం చేసుకుంటారు. ఇక్కడ జాలీ ఏర్పాటు చేయకపోవడంతో నాలుగు రోజుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆలయాధికారులు స్పందించి గోదావరి నదిలోకి వెళ్లకుండా రక్షణగా పాతపడవలను ఏర్పాటు చేసి వాటిపై గజ ఈతగాళ్లను కాపలాగా ఉంచారు. -న్యూస్‌టుడే, ముథోల్(బాసర)



4 రోజులు చుట్టేద్దాం.. నచ్చిన చోటు చూసేద్దాం!

● ఉమ్మడి జిల్లాపై అవగాహన పెంచుకునేందుకు మంచి తరుణం

నిర్మల్ జిల్లాలో...



నిర్మల్ ఖ్యాతిని తెలిపే కొయ్యబొమ్మలు

నిర్మల్ జిల్లా కేంద్రంలో తయారయ్యే కొయ్యబొమ్మలు చూడాల్సిందే. తెలికపాటి పొనికి కర్రతో 400 ఏళ్ల నుంచి తయారు చేస్తున్న ఈ బొమ్మలు సజీవంగా మన కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయి.

◆ ఇక్కడి నుంచి 15 కి.మీ. దూరంలోని నిజామాబాద్ జిల్లాలో ఉన్న శ్రీరాంసాగర్ జలాశయాన్ని చూసిరావచ్చు..


కడెం.. అందాల కనువిందు



కడెం మండల కేంద్రంలో వాగుపై నిర్మించిన జలాశయం నిర్మల్ జిల్లాలోని కడెం, దస్తూరాబాద్‌తో పాటు మంచిర్యాల జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాలకు సాగు నీరందిస్తున్న తీరును, విశేషాలు తెలుసుకోవచ్చు. బోటు ద్వారా జలాశయం అందాలను తిలకించవచ్చు.

బాసర సరస్వతి క్షేత్రం..





చదువుల తల్లి సరస్వతి అమ్మవారు ముథోల్ మండలంలోని బాసరలో కొలువై ఉంది.. గోదావరి నదీ తీరంలో ఉన్న దేవాలయాన్ని దర్శించుకోవడంతో పాటు, అక్షరాభ్యాసం చేయించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వస్తుంటారు.

◆ నిర్మల్ నుంచి బాసర వెళ్లే మార్గంలో కదిలి దేవాలయాన్ని దర్శించుకోవచ్చు..

ఆదిలాబాద్ జిల్లాలో

1200 ఏళ్ల నాటి సూర్యదేవాలయం



ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవస్థానాన్ని 122 ఏళ్ల కిందట జైనులు నిర్మించారు. ఏటా రెండు సార్లు సూర్యకిరణాలు స్వామి వారి పాదాలను స్పృశిస్తుండటం దీని ప్రత్యేకత. ఆదిలాబాద్ నుంచి 30 కి.మీ. దూరంలో ఉంటుంది.

పర్యాటకుల సందడి.. కుంటాల జలపాతం..



ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం కుంటాల జలపాతాన్ని చూడడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది నిత్యం వస్తుంటారు. చుట్టూ దట్టమైన అడవిలో ఉన్నందున అటవీమార్గం గుండా జలపాతానికి చేరుకోవడం ఓ అనుభూతి. కుంటాల నుంచి 12 కి.మీ. ఉంది.

అనుభూతిని పంచే పొచ్చెర..



ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చెర సమీపంలో ఉన్న జలపాతం పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తోంది. ఎత్తైన ప్రదేశం నుంచి నీరు కిందికి జాలువారుతాయి. దీన్ని వీక్షించడం గొప్ప అనుభూతిగా చెప్పుకోవచ్చు. బోథ్ జాతీయ రహదారి ఎక్స్ రోడ్ నుంచి ఆరు కి.మీ. దూరంలో ఉంది.

దండేపల్లి, న్యూస్‌టుడే

మూడు నెలల పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులకు దసరా సెలవులొచ్చాయి. సెలవులంటే చాలు అందరికీ సంబరమే. కొత్త ప్రదేశాల్లో ఆనందంగా గడుపుతూనే మరో వైపు మనకు దగ్గరలోని చారిత్రాత్మక ప్రాంతాలు, దేవాలయాలను ఓసారి చుట్టి వస్తే అనుభవాలు, జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయి. ఓ నాలుగు రోజుల్లో పిల్లలు చూసే ఎన్నో విశేషాలు.. వివిధ ప్రదేశాలతో ఆయా ప్రాంతాలపై అవగాహన పెంచుకోవచ్చు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని కొత్త జిల్లాల వారీగా ఇక్కడి ప్రాంతాల విశిష్టతను తెలుసుకునే అవకాశముంది.



కుమురంభీం జిల్లాలో...

కుమురంభీం స్మారక మ్యూజియం

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలం జోడేఘాట్ వద్ద నిర్మించిన కుమురంభీం స్మారక మ్యూజియం ఎంతో ప్రసిద్ధమైంది. జల్, జంగల్, జమీన్ నినాదంతో నిజాంలతో పోరాడి జీవితాన్నే త్యాగం చేసిన కుమురంభీం జీవిత విశేషాలను తెలిపే మ్యూజియం ఇది. దీనికి దగ్గరలో ఉన్న కెరమెరి ఘాట్ రహదారి కూడా వీక్షించవచ్చు.





మంచిర్యాల జిల్లాలో...

సింగరేణి.. సిరుల వేణి




మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి 10 కి.మీ. నుంచి 30కిలో మీటర్ల దూరంలోనే శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, ఇందారం, మందమర్రి, బెల్లంపల్లి గనులున్నాయి.. ఇందులో భూగర్భ గనులతో పాటు ఉపరితల గనులున్నాయి. బొగ్గు తీయడం దగ్గర నుంచి రవాణా చేసే వరకు వివిధ దశలు, కార్మికుల శ్రమను తెలుసుకోవచ్చు..

ఎల్లంపల్లి జలాశయం..



గోదావరి నదిపై హాజీపూర్ మండలం ఎల్లంపల్లి సమీపంలో నిర్మించిన జలాశయాన్ని చూడొచ్చు. ఇది మంచిర్యాల, లక్సెట్టిపేట మధ్యలో ఉంటుంది. సాగు నీటితో పాటు హైదరాబాద్ వరకు తాగు నీరందించే ప్రక్రియను వీక్షించవచ్చు.

సత్యదేవుని నిలయం..గూడెం



తెలంగాణలో ఉన్న ఏకైక సత్యదేవుని ఆలయం దండేపల్లి మండలం గూడెం సమీపంలో గోదావరి తీరంలో ఉంది. జాతీయ రహదారిని ఆనుకుని నిర్మించిన ఈదేవాలయం పక్కనే అయ్యప్ప ఆలయం, సాయిబాబా ఆలయాలు ఉన్నాయి...గోదావరి తీరంలో ఎల్లంపల్లి నుంచి నీరందించే గూడెం ఎత్తిపోతల పథకం ఉంది..

◆ ఉమ్మడి రాష్ట్రంలోనే అతిపెద్ద రెండో చర్చిగా ప్రసిద్ధి చెందిన సీఎస్ఐ చర్చి లక్సెట్టిపేటలోని ఉంది..

◆ మంచిర్యాల జిల్లాలోని జన్నారం నుంచి ఆదిలాబాద్ జిల్లా వరకు విస్తరించి ఉన్న కవ్వాల్ అభయారణ్యాన్ని తిలకించవచ్చు. జన్నారం మండల కేంద్రంలోని జింకల సంరక్షణ కేంద్రం, మ్యూజియంను సందర్శించవచ్చు. ఇక్కడ నుంచి సఫారీ వాహనంలో లోపల ఉన్న అడవిని చుట్టి రావచ్చు.

గంగమ్మ తల్లి విగ్రహానికి రంగులు



ముథోల్ (బాసర), న్యూస్‌టుడే: బాసర గోదావరి నది ఒడ్డున ఉన్న గంగమ్మ విగ్రహానికి రంగులు వేయకపోవడంతో గత నెల 19న ఈనాడులో 'గంగమ్మా.. మన్నించమ్మా' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఈఓ విజయరామారావు గంగమ్మ తల్లి విగ్రహానికి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు.

వందనం

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

నిర్మల్, న్యూస్‌టుడే : గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని నెక్లస్‌ప్లాజాలో నిర్వహించనున్న గ్రామీణ స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల సందర్శన, శిక్షణ కార్యక్రమానికి వెళ్లే బస్సును స్థానిక జిల్లా సమాఖ్య కార్యాలయంలో ప్రారంభించారు. జిల్లాలోని 18 గ్రామీణ మండలాలకు అయిదుగురు చొప్పున 90 మంది మహిళా సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి వెళ్తున్నారని చెప్పారు. శిక్షణ కార్యక్రమంలో చేతి సంచులు, జ్యూట్ బ్యాగులు, సబ్బులు, అలంకరణ వస్తువుల తయారీపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణి, కార్యదర్శి సురేఖ, కోశాధికారి బి.లక్ష్మి, డీపీఎం జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.



నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే:

మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపడుతూనే ఉంది. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. అయినా అక్రమదందాకు అలవాటు పడ్డ వారు గుట్టుగా తమ పనిని కొనసాగిస్తూనే ఉన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించొచ్చనే నమ్మకంతో పలువురు ఇందులో భాగమవుతున్నట్లు తెలుస్తోంది.

పట్టుబడ్డా వదలరు.. కేసులకు బెదరరు

● గుట్టుగా సాగుతున్న మత్తు పదార్థాల సరఫరా

క్లోరల్ హైడ్రేట్(సీహెచ్) మత్తును పెంచేలా తెల్ల కల్లు తయారు చేయడానికి విరివిగా ఉపయోగిస్తుంటారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో ఇది నిషేధిత పదార్థం. అయినా కొందరు వ్యాపారులు గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి సీహెచ్‌ను దిగుమతి చేసుకుంటున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా రాష్ట్రాల సరిహద్దులు దాటి మన దగ్గరకు తీసుకొస్తున్నారు. ఇక్కడున్న అధికారులను మచ్చిక చేసుకొని తమ దందా కొనసాగిస్తున్నారు. తాజాగా నిర్మల్ జిల్లా కేంద్రంలో సుమారు రూ.43 లక్షల విలువైన సీహెచ్ పట్టుబడటం దీనికి నిదర్శనం. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ అధికారులకు అందిన సమాచారం మేరకు స్థానిక ఆబ్కారీ అధికారులతో కలిసి చేసిన దాడిలో పెద్దమొత్తంలో సీహెచ్ నిల్వ చేసిన బస్తాలు పట్టుబడ్డాయి. సోలాపూర్ శ్రీను అలియాస్ భాయ్ అనే వ్యక్తి వీరికి ఆల్ప్రాజోలం, రూప్ సింగ్ క్లోరల్‌హైడ్రేట్ సరఫరా చేస్తున్నట్లు అధికారుల విచారణలో స్పష్టమైంది. వీరిపైనా కేసులు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

అనుమానం రాకుండా..

జిల్లాకేంద్రంలోని శాంతినగర్ శివారులో కొత్తగా వెలుస్తున్న కాలనీ. జనసంచారం తక్కువగా ఉంటుంది. అలాంటిచోట నిర్మించిన మడిగెల్లో ఎవరికీ అనుమానం రాకుండా గోదాం ఏర్పాటు చేసుకున్నారు. మామూలు సంచుల్లో క్లోరల్‌హైడ్రేట్‌ను పెద్దమొత్తంలో నిల్వచేశారు. అక్కడ 728 కిలోల సీహెచ్ లభ్యమైంది. గతంలోనూ నిర్మల్ జిల్లా కేంద్రంలో రూ.28 లక్షల విలువైన సీహెచ్ పట్టుబడిన సంగతి తెలిసిందే. నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి ఇందులో ప్రధాన సూత్రధారిగా గుర్తించి కేసు నమోదుచేశారు. తాజా ఘటనలో జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ అనే వ్యక్తి ఈ దందాను కొనసాగిస్తున్నట్లు గుర్తించారు.

గ్రామాలకు సరఫరా..!

పెద్ద మొత్తంలో తీసుకొచ్చిన పదార్థాన్ని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ పరిధిలోని గ్రామాల్లో సరఫరా చేస్తున్నారు. తాజా ఘటనలో పట్టుబడిన నిందితుడిపై ఇదివరకే ఏడు కేసులు నమోదైనట్లు అధికారులు పేర్కొనడం గమనార్హం. పైగా ఓసారి పీడీ యాక్ట్ కూడా నమోదైంది. ఇప్పుడు మరో రెండు కేసులు. ఇవన్నీ కూడా కల్తీ దందాకు సంబంధించిన ఘటనల్లోనే అనేది సుస్పష్టం. పదేళ్లకుపైగా అతడు ఈ దందాను కొనసాగిస్తున్నాడు. పట్టుబడిన వారికి విధించే శిక్షలు పెద్దగా ఫలితం చూపకపోవడంతో వారు ఏమాత్రం భయం లేకుండా తిరిగి దందాను కొనసాగిస్తున్నారు.

అధికారుల పనితీరుపై అనుమానం!

గతంలో ఎన్నడూలేని రీతిలో పెద్ద మొత్తంలో నిల్వ చేసిన సీహెచ్, ఆల్ప్రాజోలంను ఆబ్కారీ అధికారులు పట్టుకోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. దీనిపై స్థానిక ఆబ్కారీ అధికారులకు ఏమాత్రం సమాచారం లేకపోవడం గమనార్హం. స్థానిక అధికారులకు తెలియకుండా ఈ వ్యవహారం నడిచే అవకాశం లేదనే వాదనలు లేకపోలేదు.

అమ్మవారి భక్తులకు మహారాష్ట్ర రొట్టెలు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర అమ్మవారి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలను జరుపుకొంటారు. మహారాష్ట్రలోని నాందేడ్ పట్టణానికి చెందిన మహారాజ్ ప్రతి సంవత్సరం అన్నదానం చేస్తారు. ఈ సారి కూడా ఆయన సొంత డబ్బులతో అన్నదానం చేస్తున్నారు. అన్నదానంలో ఇచ్చే గోధుమ రొట్టెలను మహారాష్ట్ర నుంచి వచ్చిన మహిళలు సాధారణం కంటే అయిదింతలు పెద్దగా చేతుతో చేసి పెంక మీద కాలుస్తున్నారు. భోజనం చేయడానికి వచ్చిన భక్తులు ఈ రొట్టెలను చూసి ఆశ్చర్యపోయారు.



రొట్టెలు చేస్తున్న మహారాష్ట్ర మహిళలు

పరిశీలనకు పోటెత్తిన అభ్యర్థులు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : నిర్మల్ గ్రామీణ మండలం కొండాపూర్‌లోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో డీఎస్సీ-2024 అభ్యర్థుల ధ్రువపత్రాలను గురువారం పరిశీలించారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, భాషాపండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు సంబంధించినవి నిర్వహించడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ నిపుణులైన ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో 12 బృందాలను ఏర్పాటు చేసి 1:3 ప్రక్రియ చేపడుతున్నామని చెప్పారు. అభ్యర్థులు నిజ, రెండు జతల జిరాక్స్ ప్రతులను గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించుకుని హాజరుకావాలని వెల్లడించారు. ఏవైనా సందేహాలుంటే సాంకేతిక బృందం సభ్యుల సలహాలు తీసుకుని నివృత్తి చేసుకోవాలని పరిశీలన బృందాలకు సూచించారు. ఈ సమాచారం ఎప్పటికప్పుడు జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్ deonirmal.weebly.comలో పొందుపర్చనున్నామని వివరించారు. పరీక్షల సహాయ కమిషనర్ సిద్ధ పద్మ, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ సమన్వయకర్తలు తదితరులు పాల్గొన్నారు. మొత్తం 782 మంది అభ్యర్థులకు ఇప్పటి వరకు 494 మంది తమ ధ్రువపత్రాలను సమర్పించారని డీఈవో తెలిపారు. మిగతా వారు శనివారం సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని, ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లో స్వీకరించమని ఆయన వెల్లడించారు.



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి

టోకెన్ల కోసం వెంపర్లాట



ఆదిలాబాద్ డైట్ కళాశాలకు ధ్రువపత్రాల పరిశీలన కోసం గురువారం భారీగా అభ్యర్థులు తరలివచ్చి కౌంటర్ల వద్ద గుమిగూడారు. ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఆ సమయంలో పాలనాధికారి రాజర్షిషాలోనికి వెళ్లేందుకు కొంత ఇబ్బందిపడాల్సి వచ్చింది. ఇది గమనించిన డీఈవో ప్రణీత అభ్యర్థులకు టోకెన్లు ఇవ్వాలని సిబ్బందిని పురమాయించారు. ఆ టోకెన్ల కోసం అభ్యర్థులు పరుగులు పెట్టి పోటీ పడాల్సి వచ్చింది.

- ఈనాడు - ఆదిలాబాద్, - న్యూస్‌టుడే- పాలనాప్రాంగణం

పచ్చందాల దారిలో.. ప్రకృతిని ఆస్వాదించేలా

సింగరేణి బొగ్గు గనులు, విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు విస్తరించి ఉన్న శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలోని ప్రధాన రహదారికి ఇరువైపులా పచ్చదనం పెద్దగా కనిపించదు. కానీ మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామం వద్ద రహదారికి ఇరువైపులా పచ్చదనంతో కనువిందు చేస్తూ ఆహ్లాదం పంచుతోంది. శ్రీరాంపూర్ నుంచి ఆసిఫాబాద్ వరకు 363 జాతీయ రహదారి నిర్మించారు. మార్గమధ్యలోని బొక్కలగుట్ట వద్ద సుమారు 340 ఎకరాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో గాంధారి వనాన్ని అద్భుతంగా విస్తరించారు. ప్రస్తుతం ఆరు కిలోమీటర్లు విస్తీర్ణంలో అన్ని రకాల వేలాది చెట్లు కనువిందు చేస్తున్నాయి. అప్పటి వరకు పచ్చదనం కనిపించని చోదకులు, ప్రయాణికులకు ఒక్కసారిగా ప్రకృతి ఒడిలో నుంచి ప్రయాణిస్తుండటంతో సుమారు కిలోమీటర్ల మేర ప్రత్యేక అనుభూతి పొందుతున్నారు. జిల్లా కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి నిత్యం వందలాది మంది వ్యాయామం, యోగా, ధ్యానం చేసేందుకు వస్తుంటారు. ఇక్కడ గాంధారి మైసమ్మ ఆలయం ఉండటంతో నిత్యం భక్తులు వంటావార్పు చేసుకుంటూ ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. పక్కనే ఉన్న గాంధారిఖిల్లా గుట్టలు కనువిందు చేస్తున్నాయి. - న్యూస్‌టుడే, మందమర్రి పట్టణం



జాతీయ రహదారికి ఇరువైపులా గాంధారి వనం



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, చిత్రంలో నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలి

నిర్మల్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి పాటుపడాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, తెగల కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. వివిధ శాఖల ద్వారా ఎస్సీ, ఎస్టీలకు అందుతున్న పథకాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఎస్సీ, ఎస్టీల కోసం మంజూరైన, వినియోగించిన నిధులకు సంబంధించిన వివరాలను శాఖల వారీగా అధికారులు వివరించారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్ మరమ్మతులకు అవసరమయ్యే నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల విద్యలో ఉత్తమ ఫలితాలు వచ్చేలా కృషి చేసేందుకు కలెక్టర్, విద్యాశాఖ అధికారులను అభినందించారు. జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం కమిషన్ ఛైర్మన్, సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేసిన డీఈవో రవీందర్‌రెడ్డిని కమిషన్ ఛైర్మన్, సభ్యులు సన్మానించారు. ఎస్పీ జానకి షర్మిల, అదనపు పాలనాధికారులు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

చిరునవ్వు నవ్వేద్దాం.. ఆరోగ్యంగా ఉందాం!

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం: చిరునవ్వుతో మానసిక రుగ్మతలు దూరమవుతాయని శాస్త్రీయంగా రుజువైంది. మానవ సంబంధాలు పెంపొందుతాయి. మనిషి మానసిక స్థితిని ఆహ్లాదకరంగా ఉంచుతుంది. అంతటి ఆరోగ్యాన్ని పెంపొందించే చిరునవ్వుకు ఓ రోజుంది.. అక్టోబరు 4న 'స్మైల్ డే' నిర్వహిస్తుంటారు.

మీకు తెలుసా?



అమెరికాకు చెందిన ప్రముఖ చిత్రకారుడు హార్వే రాస్ బాల్ తొలిసారిగా స్మైలీ ఫేస్(నవ్వించే ముఖం) చిత్రాన్ని గీశారు.

అనేక ప్రశ్నలకు సమాధానం..

కొన్ని సందర్భాల్లో మన చిరునవ్వు అనేక ప్రశ్నలకు జవాబవుతుంది. ఇతరుల బాధను మాయం చేస్తుంది. దేశసేవనే ప్రాణంగా దగ్గరకు చేర్చుతుంది. పిల్లలు తమ తల్లిదండ్రులను, పెద్దలను నవ్వుతో పలకరించాలి. పెద్దలు కూడా పిల్లలకు చిరునవ్వుతో పనులు చెప్పాలి. అప్పుడే ఆ ఇల్లు ఆనందమయ కోవెలగా మారుతుంది. చిరునవ్వుతో బయటకు వెళ్తే రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. అందుకే జనాలను నవ్వించేందుకు లాఫింగ్ క్లబ్‌లు, హాస్యభరిత చిత్రాలు, కామెడీ సినిమాలు, రియాలిటీ షోలు అందుబాటులో ఉంటున్నాయి.

సచిన్‌తో సచిన్..



ఒకరేమో మరాఠీ దిగ్గజ నటుడు సచిన్ పిల్గావకర్. మరొకరేమో క్రికెట్ దేవుడు సచిన్. ఓ పురస్కార ప్రదానోత్సవ వేదికపై ఇద్దరు కలుసుకున్నారు. ఊహ తెలిసినప్పటి నుంచి మిమ్మల్ని చూస్తున్నా. అప్పటికీ, ఇప్పటికీ మీ ముఖం చిరునవ్వుతోనే కళకళలాడుతుందని టెండూల్కర్ అనడంతో వెంటనే మైక్ లాక్కొని మీరు కూడా చిరునవ్వుతోనే క్రికెట్ రంగంలో రికార్డులు నెలకొల్పారని పిల్గావకర్ చిరునవ్వుతోనే సమాధానమిచ్చారు. ఈ దృశ్యం వీక్షకులను సైతం ఆకట్టుకుంది.

ఆరోగ్యానికి మేలు



చిరునవ్వు అనేది మనిషి మానసిక స్థితిని తెలియజేస్తుంది. చిరునవ్వు అలవాటు ఉన్నవారి శరీరంలో నాడీ మండలాలు ఉత్తేజమవుతాయి. రక్త ప్రసరణ సాఫీగా జరుగుతుంది. నిద్రలేమి, ఒత్తిడి, అలసట, గ్యాస్ట్రిక్, హైపర్‌టెన్షన్, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మైగ్రేన్, కండరాల నొప్పుల నుంచి కోలుకోవచ్చు. సకారాత్మక హార్మోన్లు ఎండార్ఫిన్, సెరటోనిన్ విడుదలై మానసికోల్లాస అనుభూతిని పొందుతారు. గుండె దడ నియంత్రణలో ఉంటుంది. రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. - డా.ఓంప్రకాశ్, మానసిక వైద్య నిపుణులు

పరుగుల వర్షం కురిపించి..



భారత క్రికెటర్ అజయ్ జడేజాను ఎప్పుడు చూసినా చిరునవ్వుతోనే కనిపిస్తుంటారు. 1996లో జరిగిన ప్రపంచ క్రికెట్ కప్ క్వార్టర్ ఫైనల్‌లో పాకిస్థాన్ బౌలర్లు వకార్ యూనుస్, అకిబ్ జావేద్, అతా-ఉర్-రెహ్మాన్ అజయ్ జడేజాను రెచ్చగొట్టారు. భయపెట్టేలా బాడీలెంగ్త్ బౌలింగ్ వేశారు. ఆయన ఏకాగ్రతను భంగం చేసేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. అయినా జడేజా వారి కుయుక్తులకు లొంగకుండా చిరునవ్వుతోనే బ్యాట్‌తో పరుగుల వర్షం కురిపించారు. భారత్ భారీ స్కోరులో కీలక పాత్ర పోషించారు.

లాఫింగ్ క్లబ్..



మధుసింఘాల్ ఆదిలాబాద్‌లో మహిళల కోసం లాఫింగ్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ద్వారకానగర్ కాలనీలోని మున్సిపల్ పార్కులో రోజూ ఉదయం గంట పాటు యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. 50 మందికిపైగా మహిళలు ఈ క్లబ్‌లో చేరి యోగాభ్యాసం చేస్తున్నారు. ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటే ఇంట్లో అందరు బాగుంటారని నిర్వాహకురాలు చెబుతున్నారు.

ఉర్దూ నేర్చి.. ఉద్యోగం సాధించి!

● గిరిజన యువతి ఘనత



పవార్ మౌనిక

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఇంటి చుట్టూ ఉన్న ముస్లింలతో ఉర్దూ భాషలో మాట్లాడటం అలవాటు చేసుకున్న ఆ యువతికి ఆ భాషే చివరకు ఉద్యోగాన్ని సాధించిపెట్టింది. ఉట్నూరు మండలం లక్కారం మసీదు ఏరియాలో నివాసముండే న్యాయవాది పవార్ వసంత్‌రావు కూతురు పవార్ మౌనిక డీఎస్సీ ఉర్దూ మాధ్యమంలో ఎస్జీటీగా ఎంపికయ్యారు. ఎస్టీ విభాగంలో రెండు పోస్టులు రిజర్వు చేయడంతో ఆమెకు ఉద్యోగం దక్కడం లాంఛనమే. గురువారం డైట్ కళాశాలలో జరిగిన ధ్రువపత్రాల పరిశీలనకు ఆ యువతి హాజరైంది. ఇంటర్‌లో ద్వితీయ భాషగా ఉర్దూను ఎంచుకుంది. ఉర్దూ భాషను మిత్రులతో పాటు యూట్యూబ్ సాయంతో నేర్చుకున్నట్లు మౌనిక తెలిపారు. బీఏ లిటరేచర్ ఉర్దూలో చేస్తున్నట్లు వివరించారు. ప్రతిసారి ఉర్దూ మాధ్యమంలో రిజర్వేషన్ కేటగిరి పోస్టులు అభ్యర్థులు లేక మిగిలిపోతున్నాయి. ఈ విషయం తెలిసిన వసంత్‌రావు తన కూతురు మౌనికను ఉర్దూ భాష లిపిని నేర్చుకోవాలని ప్రోత్సహించారు. ఫలితంగా ఆ యువతి ఉద్యోగం సాధించగలిగింది. ఎంపికైన మరో అభ్యర్థి రాథోడ్ ఆర్థిక స్వయాన మౌనికకు చిన్నమ్మ కావడం మరో విశేషం. వీరిద్దరూ ఉర్దూ మాధ్యమంలో పాఠాలు బోధించనున్న తొలి గిరిజన తెగ అభ్యర్థులుగా చరిత్ర సృష్టించనున్నారు.

ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిపై ఆరోపణల కలకలం

ముథోల్(బాసర), న్యూస్‌టుడే : బాసర ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిపై పలు ఆరోపణలతో కూడిన కరపత్రం గురువారం ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ పేరిట విడుదలవడం కలకలం సృష్టించింది. ఆ కరపత్రం పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్‌తోపాటు ఆర్జీయూకేటీ ఉపకులపతిగా కొనసాగుతూ, పేద విద్యార్థులకు చెందాల్సిన డబ్బులు కాజేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాడని ఆరోపించారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులను నియమించుకొని, ట్రిపుల్ ఐటీ ఉద్యోగులుగా రూ.లక్షల జీతం ఇస్తూ అక్రమాలకు తెరలేపారన్నారు. ఆర్జీయూకేటీలో విద్యార్థులు, మహిళా ఉద్యోగులను వేధించడం, అప్పుడప్పుడూ ఇక్కడికి వస్తూ విశ్వవిద్యాలయానికి సంబంధించిన డబ్బులు దండుకున్నాడన్నారు. చేయని పనులకు నకిలీ బిల్లులు సృష్టించి, భోజనశాలల నిర్వాహకుల వద్ద డబ్బులు వసూలు చేశాడని ఆరోపించారు. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' ఆర్జీయూకేటీ ఉపకులపతిని చరవాణిలో సంప్రదించగా తాను దీనిపై ఏమి మాట్లాడనని తెలిపారు.

శైలపుత్రి నమోస్తుతే..




శైలపుత్రిగా దర్శనమిస్తున్న అమ్మవారు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవగా గురువారం బాసర అమ్మవారు శైలపుత్రి అవతారంలో దర్శనమిచ్చారు. అంతకుముందు అమ్మవారికి అభిషేకం, వ్యాసమహర్షికి పూజలు చేసి ఘటస్థాపనకు అవసరమైన నీటిని తీసుకెళ్లారు. అనంతరం ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో ఘటస్థాపన పూజలో ఎమ్మెల్యే రామారావు పటేల్, ఆలయ ఈఓ విజయరామారావు, ఆలయ ఛైర్మన్ శరత్‌పాఠక్‌లు పాల్గొన్నారు. నవరాత్రులు ప్రారంభం కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారి దర్శనం, అక్షరాభ్యాసాలు చేయించారు. బాసర మాజీ సర్పంచి దయాల లక్ష్మణ్‌రావు తులం బంగారంతో అమ్మవారికి తయారు చేయించిన ముక్కు పుడకను ఆలయ ఈఓకు అందజేశారు.



ఘట స్థాపన చేస్తున్న ఆలయ వేద పండితులు, ఈఓ విజయరామారావు



ఆలయంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్



వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రదర్శనలో అష్టాదశ శక్తి పీఠాల విగ్రహాలు

బెల్లంపల్లిలో అష్టాదశ శక్తి పీఠాలు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : వివిధ రాష్ట్రాల్లో వెలసిన అష్టాదశ శక్తి పీఠాలను దర్శించుకోవాలంటే వ్యయప్రయాసలతో కూడుకున్నది. ఇది అందరికీ సాధ్యం కాదు. శక్తి పీఠాలను దర్శించుకుంటే అంతా మంచే జరుగుతుందనేది భక్తుల విశ్వాసం. అలాంటి శక్తి పీఠాలను బెల్లంపల్లి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. అమ్మవార్ల శక్తి పీఠాల విగ్రహాల వద్ద మిరుమిట్లు గొలిపేలా లైటింగ్ ఏర్పాటు చేయడంతో వాటి స్వరూపం అచ్చంగా అక్కడికి వెళ్లి దర్శించుకున్న అనుభూతి కలుగుతుంది. దుర్గాదేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన శక్తి పీఠాల ప్రదర్శన ఆకట్టుకుంటుంది.

నిషేధిత మత్తుపదార్థం స్వాధీనం

● సరకు విలువ రూ.43 లక్షలు



పట్టుకున్న ఆల్ఫాజోలం, క్లోరల్‌హైడ్రేట్ సంచులతో ఆబ్కారీ అధికారులు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ గోదాంలో నిల్వ చేసిన కల్తీ కల్లు తయారీకి వినియోగించే మత్తు పదార్థాన్ని(క్లోరల్ హైడ్రేట్) ఆబ్కారీశాఖ రాష్ట్ర బృందం ఆధ్వర్యంలో గురువారం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 728 కిలోల సీహెచ్‌ను ఇక్కడ నిల్వ ఉంచారు. ఆబ్కారీశాఖ ఉన్నతాధికారులకు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో గురువారం సోదాలు చేపట్టగా ఈ విషయం బయటపడింది. స్థానిక ద్వారకానగర్‌లో ఉండే శ్రీనివాస్‌గౌడ్ అనే వ్యక్తి ఇంట్లో ఆల్ఫాజోలం నిల్వ చేశాడనే పక్కా సమాచారంతో అధికారులు తనిఖీ చేపట్టారు. అతడి వద్ద 3.3 కిలోల ఆల్ఫాజోలం లభించింది. లోతుగా విచారించగా శాంతినగర్‌లోని ఓ గోదాంలో సీహెచ్ నిల్వ చేసినట్లు అంగీకరించాడు. అక్కడికి చేరుకున్న అధికారులు సీహెచ్ బస్తాలను స్వాధీనం చేసుకొని కార్యాలయానికి తరలించారు. ఈ మొత్తం విలువ రూ.43 లక్షలు ఉంటుందని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృంద పర్యవేక్షకుడు ప్రదీప్‌రావు తెలిపారు. నిందితుడిపై గతంలోనూ పలు కేసులు, పీడీ యాక్ట్ నమోదైనట్లు ఆయన వివరించారు. తాజా ఘటనలో అతడిపై మరో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్ నుంచి ఇది సరఫరా అవుతున్నట్లు గుర్తించామని, అసలు సూత్రధారులను పట్టుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు.

ఆటల్లో మేటి.. సత్తా చాటి

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఏడాదిలో చివరి నాలుగు నెలలు క్రీడా మాసంగా చెప్పొచ్చు. ఎస్‌జీఎఫ్‌తో పాటు వివిధ క్రీడా అసోసియేషన్లు ఈ రోజుల్లోనే పోటీల నిర్వహణ చేస్తుంటారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ ఇలా అన్ని స్థాయిల్లో ఈ 120 రోజుల్లోనే జరుగుతుంటాయి. ప్రతిభ ఉన్న క్రీడాకారులు బయటికొచ్చేదీ.. వారి భవిష్యత్తును బంగారు బాటవేసుకునే అవకాశం ఇప్పుడే కావడం విశేషం. ఈ సంవత్సరం గత రెండు నెలలుగా ఎస్‌జీఎఫ్, అసోసియేషన్లు జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి పోటీలు పోటాపోటీగా నిర్వహిస్తోంది. ఆయా విభాగాల్లోని క్రీడాకారులు మెరుగైన ఆటతీరును కనబరుస్తున్నారు. రాష్ట్ర, జాతీయ పోటీలకు అర్హత పొందుతున్నారు. ఇటీవల జరిగిన పలు పోటీల్లో సత్తా చాటి.. ఉన్నతస్థాయికి చేరుకున్న పలువురిపై 'న్యూస్‌టుడే' కథనం.



ఇటీవల రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు

రాకెట్‌తో.. ర్యాంకులకు పోటీ



మంచిర్యాల జిల్లాకు చెందిన అనన్య.. స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. బ్యాడ్మింటన్‌పై ఆసక్తితో కొంతకాలం జిల్లా కేంద్రంలోనే శిక్షణ పొందగా ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ శిక్షణ కేంద్రంలో సాధన చేస్తోంది. రాకెట్‌తో మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. పాఠశాల క్రీడా సమాఖ్య తరపున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ఆటతీరుతో ఆకట్టుకుంది. అండర్-15 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయిలో 8, జాతీయస్థాయిలో 30వ ర్యాంకులో కొనసాగుతోంది. ప్రస్తుతం విజయవాడలో జరుగుతున్న ఆలిండియా ర్యాంకింగ్ పోటీల్లో మరింత మెరుగైన స్థానం కోసం పోటీపడుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో పీఎన్బీ మెట్‌లైఫ్ జేబీసీ రాష్ట్రస్థాయి ఓపెన్ బ్యాడ్మింటన్ సత్తాచాటి జాతీయస్థాయికి ఎంపికైంది.

హ్యాండ్‌బాల్‌లో జాతీయస్థాయికి



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల(సిర్పూర్-టి) పదో తరగతి విద్యార్థి దుర్గం యోగి హ్యాండ్‌బాల్‌లో సత్తాచాటుతున్నాడు. జట్టులో నాలుగో సభ్యుడిగా మెరుగైన ప్రదర్శన ఇస్తూ ఆకట్టుకున్నాడు. ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ఆటతీరును కనబరిచాడు. ఉమ్మడి జిల్లా జట్టు మొదటిస్థానం కైవసం చేసుకోవడంలో తనవంతు బాధ్యతను నిర్వర్తించాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఇప్పటికే నాలుగు సార్లు ఎంపిక కాగా తొలిసారి జాతీయస్థాయిలో చోటు సాధించాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న పోటీల్లో తన ప్రతిభను పరీక్షించుకుంటున్నాడు.

మొదటిసారి.. మెరుగైన స్థాయి

కౌటాల మండలానికి చెందిన కార్తీక్.. మొదటిసారి రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. హ్యాండ్‌బాల్ జట్టులో మూడో సభ్యుడిగా సత్తాచాటేందుకు సిద్ధంగా ఉన్నాడు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో అభ్యసిస్తున్న కార్తీక్ ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కీలకపాత్ర పోషించాడు. అసోసియేషన్, ఎస్‌జీఎఫ్ ఏర్పాటు చేసిన పలు పోటీల్లో ప్రతిభ చాటాడు. రాష్ట్రస్థాయి ధ్రువీకరణపత్రాలు సొంతం చేసుకున్నాడు. జాతీయస్థాయికి చేరి అదే ఆటతీరుతో మరింత ఉన్నతస్థానానికి చేరుకునేందుకు సిద్ధంగా ఉన్నాడు.




యోగా.. బాగా చేస్తాడు

మంచిర్యాల జిల్లా బొక్కలగుట్టకు చెందిన రాహుల్.. యోగాసనాల్లో దిట్ట. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. యోగాపై మక్కువతో ఆరేళ్లుగా సాధన చేస్తున్నాడు. ఒళ్లును విల్లులా చేస్తూ ఔరా అనిపిస్తున్నాడు. జిల్లా పోటీల్లో సాధించిన పతకాలకు లెక్కే లేకపోగా రాష్ట్రస్థాయిలోనూ అదేతీరును కనబరుస్తున్నాడు. రెండుసార్లు పసిడి పతకాలు కైవసం చేసుకున్నాడు. జాతీయ పోటీల్లోనూ కాంస్య పతకాన్ని తన ఖాతాలో వేసుకోగా ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆసనాలతో ఆకట్టుకుని నాలుగోసారి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. మరింత మెరుగైన ప్రదర్శన చేసేందుకు సన్నద్ధమవుతున్నాడు.



ఆసనాలతో ఔరా అనిపించేలా..



హైదరాబాద్‌లో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న మంచిర్యాల జిల్లాకు చెందిన వైష్ణవి యోగాలో ప్రతిభచాటుతోంది. గత నాలుగేళ్లుగా శిక్షణ తీసుకుంటుండగా మొదటిసారి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఇటీవల నిజామాబాద్ జిల్లాలో అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకుని కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. గతంలో ఒకసారి రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. జాతీయస్థాయికి తొలిసారి చేరగా ఆసనాలతో ఆకట్టుకుని పతకం సాధించేందుకు సిద్ధమవుతోంది.

మేమున్నాం.. మీకు తోడుగా...

నిర్మల్ 97053 46693
భైంసా 63099 94649
ఖానాపూర్ 96401 62091

?: నిర్మల్‌లోని మంజులాపూర్ అంబేడ్కర్ కాలనీలో మినీ ట్యాంకుకు సరఫరా అయ్యే పైప్‌లైన్ దెబ్బతింది. నీరు వృథాగా పోతున్నాయి. - **స్థానికులు**

✓ పరిశీలించి సిబ్బందితో మరమ్మతులు చేయిస్తాం. నీటి వృథా అరికడతాం. - **సి.వి.ఎన్.రాజు, మున్సిపల్ కమిషనర్, నిర్మల్**

– న్యూస్‌టుడే, నిర్మల్ అర్బన్

శిశువుల అత్యవసర వైద్యానికి 108 సేవలు


అంబులెన్స్‌లోని సౌకర్యాలు

సారంగాపూర్, న్యూస్‌టుడే : అనారోగ్యానికి గురైన శిశువుల వైద్యానికి అత్యవసరంగా న్యూయోమల్ అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని 108 జిల్లా ఇన్‌ఛార్జి లింగచారి అన్నారు. గురువారం సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు న్యూయోమల్ అంబులెన్స్ సేవలపై అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన, ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన శిశువులు అనారోగ్యానికి గురైతే 108కి సమాచారం అందించి చిరునామా తెలియజేస్తే వెంటనే తగిన ఆసుపత్రికి వారిని తీసుకెళ్తారన్నారు. చిన్నారుల అత్యవసర చికిత్సలకు సంబంధించిన అన్ని సౌకర్యాలు ఈ అంబులెన్స్‌లో ఉంటాయని చెప్పారు. వైద్యుడు వేదవ్యాస్, ఈఎంటీలు నవీన్, సాగర్, పైలట్‌లు సతీష్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

నిర్మల్, న్యూస్‌టుడే : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పాలనాధికారి అభిలాష అభినవ్ అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి ధాన్యం కొనుగోళ్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిలతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సన్న, దొడ్డు రకాల ధాన్యం కొనుగోలు చేసేందుకు వేర్వేరు కాంటాలు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం సంచులపై కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన కోడ్ నెంబరు నమోదు చేయాలన్నారు. అనంతరం పాలనాధికారి మాట్లాడుతూ ఈ సీజన్‌లో కేంద్రాలకు ధాన్యం ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ధాన్యం అక్రమ రవాణా జరగకుండా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పోలీసు నిఘా ఉంచాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టెంట్లు, లైటింగ్, తదితర వసతులు కల్పించాలన్నారు. ఎస్పీ జానకి షర్మిల, జిల్లా అదనపు పాలనాధికారి(రెవెన్యూ) కిషోర్‌కుమార్, డీఎస్‌ఓ కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రవీందర్‌రెడ్డి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో మెరిసిన సోదరులు


సోదరులు బుల్లొళ్ల విజయ్ కుమార్, అక్షయ్‌కుమార్

లోకేశ్వరం, న్యూస్‌టుడే: నిరుపేద కుటుంబంలో పుట్టిన అన్నాదమ్ముళ్లు ఒకే సారి డీఎస్సీలో ర్యాంకులు సాధించారు. లోకేశ్వరం మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన బుల్లొళ్ల దావు-భూమవ్వల ఇద్దరు కుమారులు విజయ్‌కుమార్, అక్షయ్‌కుమార్. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో ప్రైవేటు పాఠశాల్లో చదివించే స్తోమత లేక స్థానికంగా ఉన్న సర్కారు బడిలో చదివించారు. ఇద్దరూ పదో తరగతి వరకు పుస్పూర్‌లో, ఇంటర్ లోకేశ్వరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదవగా విజయ్‌కుమార్ నిజామాబాద్‌లో డీఈడీ పూర్తి చేశారు. అక్షయ్‌కుమార్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసి బీఈడీ చదివారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో విజయ్‌కుమార్ ఎస్జీటీ విభాగంలో 133వ ర్యాంకు సాధించగా అక్షయ్‌కుమార్ ఎస్జీటీలో 3వ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ తెలుగు పీఈ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో 9వ ర్యాంకు సాధించారు. మొన్నటి వరకు కూలీలుగా పని చేసి చదివించిన కుమారులిద్దరూ ఒకే సారి సర్కారు కొలువుకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


మాట్లాడుతున్న పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ

బిల్లులు విడుదల చేయాలి

నిర్మల్, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులకు సంబంధించి రెండేళ్లుగా పెండింగ్‌లోని బిల్లులను ప్రభుత్వం విడుదల చేయాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం డీఎస్సీ 2008 అభ్యర్థులకు శాశ్వత పరిష్కారం చూపించడం అభినందనీయమన్నారు. శుక్రవారం నిర్మల్‌లోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఉంటుందన్నారు. ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, వెడ్మ బొజ్జు, మాజీ మంత్రి ఐకేరెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి, ఏ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సాయన్న, ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా వన్యప్రాణుల వారోత్సవాలు

పెంబి, న్యూస్‌టుడే: వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా గురువారం పెంబి అటవీశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, జంతు ప్రేమికులకు వన్యప్రాణుల పట్ల అవగాహన కల్పించారు. ఎఫ్ఆర్వో రమేష్, డీఆర్వో ప్రతాప్‌నాయక్, బీట్ అధికారి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


లోకేశ్వరంలో దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న భక్తులు


కుంటాలలో..


కుభీరులో..


భైంసాలో..


కదిలి అన్నపూర్ణమాత ఆలయంలో..


లక్ష్మణచాంద: కనకాపూర్‌లో కొలువుదీరిన దుర్గమ్మ


దిలావర్‌పూర్ ఎల్లమ్మ ఆలయంలో..

కొలువుదీరిన దుర్గమ్మ

దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఆయా గ్రామాల్లో దుర్గామాతలను మండప నిర్వాహకులు కొలువుదీర్చారు. గురువారం నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దుర్గాదేవి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తులు కనులపండువగా జరిపారు. ఉపవాస దీక్షలు పాటించి భక్తిశ్రద్ధలతో అమ్మవారిని శోభాయాత్రగా తీసుకొచ్చి మండపాల్లో ప్రతిష్ఠించారు. మహిళలు పెద్ద సంఖ్యలో మంగళహారతులతో తరలివచ్చారు. భక్తులు దుర్గామాతకు మొక్కులు తీర్చుకుని ప్రసాద వితరణ చేశారు. అమ్మవారి నామస్మరణతో గ్రామాలు మార్మోగాయి.

- న్యూస్‌టుడే, బృందం


తర్లాపాడ్ గ్రామంలో..


భైంసాలో కార్తికేయ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే పి.రామారావు పటేల్


కొత్తగూడెంలో..


ఖానాపూర్ : విద్యానగర్‌లో అమ్మవారిని మంగళహారతులతో ఊరేగింపుగా మండపానికి తరలిస్తున్న భక్తులు


ఖానాపూర్ : శివాజీనగర్ మహాలక్ష్మీ ఆలయం


ఖానాపూర్ : ఇంద్రనగర్ ఎస్సీకాలనీలో కొలువుదీరిన దుర్గామాత

అసైన్డు భూముల్లో ఆగని మొరం దందా


లావుని పట్టాభూముల్లో మొరం తవ్వకాలతో మైదానంలా మారిందిలా...

ఖానాపూర్, న్యూస్‌టుడే: ధనార్జనే ధ్యేయంగా మొరం వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తున్నారు. ఖానాపూర్ పట్టణ శివారులోని ఓ సర్వే నంబరులోని ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో(లావుని పట్టాలు), డబుల్ బెడ్‌రూం వెనుక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన తవ్వకాలు చేపట్టారు. మొరం విక్రయాలు చేపడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. లావుని పట్టాలు కలిగిన భూములను సైతం కొంతమంది యజమానులు మొరం వ్యాపారుల వద్ద డబ్బులు తీసుకొని అనధికారికంగా అనుమతులు ఇస్తున్నారు. ఇదంతా జరుగుతున్నప్పటికీ అధికారులు మిన్నకుండిపోవడం విమర్శలకు తావిస్తోంది. పంట సాగుకు పనికొచ్చే భూములను 20 నుంచి 30 అడుగుల లోతు వరకు తవ్వకాలు చేపట్టడంతో బొరియలుగా, చెరువులుగా మారుతూ భవిష్యత్తులో భూములు పనికిరాకుండా పోతున్నాయి. ఈ భూముల్లో వందల సంఖ్యలో విలువైన టేకు, నాన్ టేకు చెట్లు నేలమట్టమవుతున్నాయి. ఇటీవల మొరం తరలిస్తున్న మూడు టిప్పర్‌లను తహసీల్దార్ శివరాజ్ పట్టుకొని సీజ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్‌ను సంప్రదించగా 'మొరం తవ్వకాలపై తనిఖీలు చేపడుతున్నాం. మొరం వ్యాపారులు ఇన్‌ఫార్మర్లను పెట్టుకొని అక్కడికి వెళ్లేసరికి తప్పించుకుంటున్నారు. ఇదంతా మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సిబ్బంది కొరత ఉందని చెబుతున్నారు. పోలీసు అధికారుల సహకారంతో మొరం తవ్వకాలపట్ల కఠిన చర్యలు తీసుకుంటున్నాం' అని అన్నారు.

ఉత్సవమూర్తుల విగ్రహాలతో ఊరేగింపు


లక్ష్మణచాందలో విగ్రహాలతో గ్రామస్థుల ఊరేగింపు

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని అష్టభుజవేణు గోపాలస్వామి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇక్కడ దసరా వరకు నిత్యం స్వామి రథోత్సవాన్ని ఊరేగిస్తారు. గతంలోని ఉత్సవమూర్తుల విగ్రహాల స్థానంలో గ్రామాభివృద్ధి కమిటీ, గ్రామంలోని దాతల సహకారంతో రూ.7.50 లక్షలతో ఇత్తడి విగ్రహాలను ప్రత్యేకంగా తయారు చేయించారు. గ్రామానికి తీసుకువచ్చిన విగ్రహాలను ప్రత్యేక పూజల అనంతరం గ్రామంలో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. నిత్యం నిర్వహించే రథోత్సవంలో వీటిని ఏర్పాటు చేసి ఊరేగింపు నిర్వహిస్తారు.

కనీస వేతనం అందజేయాలి

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : పట్టణ పేదరిక నిర్మూలన పథకంలో ఆర్పీలుగా విధులు నిర్వహిస్తున్న వారికి కనీస వేతనం రూ.15,600 అందజేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. గురువారం నిర్మల్‌లోని టీఎన్‌జీవోస్ భవనంలో నిర్వహించిన యూనియన్ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని మూడు పురపాలికల్లో 89 మంది పని చేస్తున్నారని చెప్పారు. స్వయం సహాయక సంఘాల అభ్యున్నతికి కృషి చేస్తున్న వీరికి కనీస వేతనంతో పాటు రూ.10 లక్షల సాధారణ బీమా, ప్రతి నెలా వేతనాలు, ఆరోగ్య, గుర్తింపు కార్డులు ఇవ్వాలని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్, కోశాధికారి బి.లలిత, కమిటీ సభ్యుడు డి.పోశెట్టి, నాయకులు భాగ్య, జ్యోతి, స్వరూప, లక్ష్మి, రజిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతం

కుంటాల, న్యూస్‌టుడే: ఎల్ఆర్ఎస్-2020 ప్లాట్ల, లేవుట్ క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతం చేసినట్లు భైంసా డీఎల్‌పీఓ సుదర్శన్ అన్నారు. కుంటాలలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు సంబంధించిన ప్లాట్లను క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తిరస్కరణకు గురవుతాయన్నారు. లేఅవుట్ నిబంధనల ప్రకారం ఉండే ప్లాట్లను మాత్రమే క్రమబద్ధీకరిస్తామన్నారు. కల్లూరులో 118, కుంటాలలో 238, లింబా(కె)లో 15, ఓలాలో ఒకటి మండలంలో మొత్తం 372 దరఖాస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. ఎంపీడీఓ తాటికొండ లింబాద్రి, ఎంపీఓ అబ్దుల్ రహీం, ఆర్ఐ అడెల్లు, కార్యదర్శి రాజబాపు, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ కార్డుల సర్వే షురూ..


హస్గుల్‌లో వివరాలు సేకరిస్తున్న అధికారులు

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: కుటుంబ డిజిటల్ కార్డుల జారీ చేయడానికి ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని హస్గుల్, పట్టణంలోని ఖాజీగల్లి, కోర్బాగల్లి, షకీల్ గల్లిలను ఎంపిక చేసింది. అధికారులు గురువారం ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. కుటుంబీకుల సమ్మతితో మార్పులు, చేర్పులు చేస్తూ ఫోటోలు తీసుకున్నారు. అయిదు రోజులపాటు కొనసాగే సర్వేలో ప్రజలందరూ అందుబాటులో ఉండి సర్వే బృందాలకు సహకరించాలని అధికారులు కోరారు. నోడల్ అధికారి, ఆర్డీఓ కోమల్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఖానాపూర్ గ్రామీణం: మండలంలోని కొత్తపేట్ గ్రామంలో గురువారం నోడల్ అధికారి గోవింద్ ఆధ్వర్యంలో కుటుంబ డిజిటల్ కార్డు-పైలట్ సర్వే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని సుమారు 140 కుటుంబాల డిజిటల్ కార్డులకు సంబంధించి సర్వే నిర్వహించామని ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్ రావు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు మధుకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేర వార్తలు

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

సోన్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని న్యూబొప్పారం గ్రామంలో చోటు చేసుకుంది. సోన్ ఎస్‌హెచ్ఓ తాహెర్ ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని న్యూబొప్పారం గ్రామస్థుడు శివరాత్రి రవి(33) పని చేయకుండా మద్యం తాగుతూ జులాయిగా తిరుగుతూ ఉండేవాడు. గురువారం ఉదయం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులను తిడుతూ వారి ఇంటి వెనకాల ఉన్న రేకుల షెడ్డులోని ఇనుప దూలానికి చీరతో ఉరి వేసుకున్నాడు. కొంతసమయం తర్వాత కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ఉరి వేసుకొని మృతి చెంది ఉన్నాడు. అతడికి భార్య, పదేళ్లలోపు కూతురు, కొడుకు ఉన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరు..

కుంటాల, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని లింబా(కె)లో చోటు చేసుకుంది. కుంటాల ఎస్సై సీహెచ్.భాస్కరచారి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బోరిగాం రమేష్(42) వండ్రంగి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మనస్తాపంతో బుధవారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శబ్దానికి భార్య నిద్రలేచి గమనించగా భర్త దూలానికి వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సాయంతో కిందకు దింపారు. 108కు సమాచారం ఇవ్వగా వారు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: బతుకుదెరువు కోసం వచ్చిన ఓ వలస కూలీ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. భైంసా గ్రామీణ ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపిన కథనం ప్రకారం బిహార్ రాష్ట్రానికి చెందిన నితీష్‌కుమార్ తమ్ముడు కరణ్‌కుమార్‌తో కలిసి సుంక్లి సమీపంలోని రైస్‌మిల్లులో కార్మికులుగా పని చేస్తున్నారు. వంట సామగ్రి కోసం బుధవారం రాత్రి వానల్‌పాడ్ గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి కిందపడిపోయారు. వాహనం నడుపుతున్న నితీష్‌కుమార్‌కు తీవ్రగాయాలుకాగా కరణ్ కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను భైంసా ప్రాంతీయాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నితీష్‌కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ఆసుపత్రికి సిఫార్సు చేశారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేధించిన కేసులో రెండు నెలల జైలు



కడెం, న్యూస్‌టుడే : మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ మహిళను వేధింపులకు గురిచేసిన కేసులో ఒకరికి రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ గురువారం ఖానాపూర్ న్యాయమూర్తి జితిన్ కుమార్ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తెలిపారు. 2015లో నమోదైన ఈ కేసు విచారణ అనంతరం టి.గణేష్ అనే నిందితునికి రెండు నెలల జైలుశిక్ష, రూ.రెండు వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్టు ఎస్సై పేర్కొన్నారు.

గెలుపే లక్ష్యంగా సాగాలి : భాజపా

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాజపా గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ శ్రేణులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి జనార్దన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని పించనర్ల సంఘం భవనంలో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ వైఫల్యాలపై పట్టభద్రులను చైతన్యపర్చాలన్నారు. అదే సమయంలో ప్రధాని మోదీ నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, దేశంలో జరుగుతున్న అభివృద్ధి, పార్టీ విధివిధానాలు, పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అర్హులైనవారంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, సామ రాజేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

కుభీరు, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి భైంసాకు తీసుకొచ్చిన కుభీరుకు చెందిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని గురువారం హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ సోము, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రతిని ఎస్పీకి అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓ వర్గానికి చెందిన యువకుడు బాలికను పథకం ప్రకారమే భైంసాకు తీసుకొచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పడిపెల్లి గంగాధర్, ఏశాల దత్తాత్రి, బోయిడి అభిషేక్, రాఠోడ్ కమలేష్, జాదవ్ అజయ్ కందుర్ స్రనివాస్ తదితరులున్నారు.

ఘనంగా బతుకమ్మ వేడక


కుంటాలలో..


ముధోల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


పార్డి(కె)లో ..


భైంసాలో కోలాటం

జిల్లావ్యాప్తంగా పలు గ్రామాల్లో గురువారం బతుకమ్మ పండగను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే గునుగు, తంగేడు పువ్వులను సేకరించి తీరొక్క పూలతో బతుకమ్మలను తయారు చేశారు. భక్తితో పూజించారు. ప్రధాన వీధుల్లో ఆటపాటలతో కోలాటం, నృత్యాలు చేస్తూ ఆడిపాడారు. అనంతరం గ్రామం చివరన ఉన్న చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

- న్యూస్‌టుడే, బృందం


భైంసా: సాయినగర్ కాలనీలో..


గంగమ్మ చెంతకు బతుకమ్మ


గడ్డెన్న జలాశయంలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు


బతుకమ్మలతో మహిళలు, చిన్నారులు


గడ్డెన్న జలాశయం వద్ద బతుకమ్మతో ఎమ్మెల్యే పి.రామారావు పటేల్


కుంసరలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బాధితురాలికి న్యాయం చేయాలి

నిర్మల్ అర్బన్: నిర్మల్ పట్టణం గాంధీనగర్‌కు చెందిన గంధం రమాదేవికి కేటాయించిన చౌకధరల దుకాణాన్ని తిరిగి ఇప్పించి న్యాయం చేయాలని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. గురువారం నిర్మల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2021లో దుకాణం మంజూరయ్యిందని, మరొకరికి అక్రమంగా అప్పగించి నడిపిస్తున్నారని ఆరోపించారు. దీనిపై జిల్లా ఎస్పీకి విన్నవించగా వారిపై కేసు నమోదు చేశారన్నారు. విచారణ జరిపి బాధితురాలికి దుకాణం కేటాయించాలని కోరారు. నాయకులు దుర్గం నూతన్‌కుమార్, నాగెల్లి నర్సయ్య, తొడసం శంభు, మురళీమోహన్, ఫసిఉద్దీన్, డి.పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు

దిలావర్‌పూర్: అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై సందీప్ అన్నారు. గురువారం దిలావర్‌పూర్ గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రం నుంచి మొరం తరలించడంతో రైతు ఫిర్యాదు మేరకు ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని తెలిపారు. తదుపరి చర్యలకు స్థానిక తహసీల్దార్‌కు అప్పగించమన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో ఎస్పీ పూజలు

నిర్మల్ పట్టణం: శరన్నవరాత్రుల ప్రారంభం నేపథ్యంలో స్థానిక బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయంలో జిల్లా పోలీసు అధికారి డా.జి.జానకి షర్మిల గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీపంలో దసరా వేడుకలు నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. శాంతియుతంగా ఉత్సవాలు జరిగేలా చూడాలని, రద్దీ నియంత్రణకు ప్రత్యేకంగా బారికేడ్లను ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యలు, కావాల్సిన వసతులను అడిగి తెలుసుకున్నారు.

సంక్షిప్త సమాచారం

నిర్మల్ పట్టణం: దేవీ శరన్నవరాత్రి వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక నందిగుండం ప్రసన్న దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు కొండాజి వెంకటాచారి నేతృత్వంలో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి మాలధారణ చేశారు. ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు మాలధారణ ఉపయోగపడుతుందన్నారు.

అటవీ సంపద కాపాడుకుందాం

కడెం: వన్యప్రాణులను, అడవులను కాపాడుకుంటేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కడెం ఎఫ్ఆర్వో గీతారాణి అన్నారు. గురువారం వన్యప్రాణి సప్తాహ కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి కడెం వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అడవులను, వన్యప్రాణులను కాపాడుకుందామంటూ నినాదాలు చేశారు. డీఆర్వోలు ప్రకాష్, సిద్ధార్థ, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

ఖానాపూర్: పట్టణంలోని గ్రంథాలయంలో పాఠకులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే రూ.20 వేల విలువ చేసే పుస్తకాలను విన్నర్ పబ్లికేషన్ సలహాదారు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ ఇచ్చారు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు శివకృష్ణ చేతులమీదుగా గురువారం లైబ్రేరియన్ పృథ్వీకి అందజేశారు.

విద్యార్థులకు చేయూత

భైంసా గ్రామీణం: సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పట్టణంలోని వివేకానంద ఆవాసం విద్యార్థులకు లోకేశ్వరం మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన రమలత-దేవేందర్‌రెడ్డి దంపతులు చేయూతనందించారు. శ్రీనగర్‌లో ఆర్మీగా విధులు నిర్వహిస్తున్న దేవేందర్‌రెడ్డి తన కూతురు హిమాన్షు పుట్టినరోజు సందర్భంగా దసరా పండగను పురస్కరించుకుని గురువారం ఆ విద్యార్థులందరికి కొత్త దుస్తులు పంపిణీ చేశారు. ఒకపూట భోజనం, అరటి పండ్లు, ఆవాసానికి ఆరు ఫ్యాన్లు అందజేశారు.

పంచాయతీ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని వినతి

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎగ్గాం గ్రామ పంచాయతీ పరిధి బాబుల్‌గాం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆ గ్రామస్థులు గురువారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వేరే గ్రామానికి అనుబంధంగా ఉండటంతో తమ గ్రామం అభివృద్ధికి నోచుకోవడం లేదని పేర్కొన్నారు. మాజీ సర్పంచి సంజీవ్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డీజేలపై నిషేధం

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే అధిక శబ్దాలతో కూడిన సౌండ్ సిస్టమ్, డీజేలపై నిషేధాన్ని విధిస్తున్నట్లు పాలనాధికారి అభిలాష అభినవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి ఈ నెల 18 వరకు రాత్రి పది గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు నిషేధం అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.

లోకేశ్వరం: డీజేలకు ఎలాంటి అనుమతులు ఇవ్వమని ఎస్సై అశోక్‌కుమార్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు తప్పవని పేర్కొన్నారు.